

ఓటేద్దామని..



(ఆంధ్రజ్యోతి బృందం)

పోలింగ్ సమయం సమీపిస్తోంది. మరో 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. అయితే ఓటు హక్కు వినియోగించేందుకు వలస ఓటర్లు జిల్లాకు భారీగా తరలివస్తున్నారు. ఉద్యోగ, వ్యాపారాలు, ఉపాధి పనులు ఇతరత్రా కారణాలతో వేర్వేరు రాష్ట్రాలు, జిల్లాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు వస్తున్నారు. విదేశాల నుంచి కూడా అత్యధికులకు జిల్లాకు వస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఓటు వేసి తమ అభిమాన నేతలను గెలిపించుకునేందుకు కుటుంబాలతో సహా పట్టణాలు, పల్లెలకు చేరుతున్నారు.

- అభిప్రాయాలు 7లో..

వైసీపీ ప్రలోభాల వల

● ప్రతి ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు ● మహిళలకు చీరల పంపిణీ ● ముగిసిన ప్రచార ఘట్టం.. రేపు పోలింగ్



పార్వతీపురం, మే11 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సంగ్రామంలో కీలకమైన ప్రచార పర్వానికి తెరపడింది. శనివారం సాయంత్రం ఆరు గంటల తర్వాత మైక్‌లు మూగబోయాయి. ఎక్కిడకక్కడే ప్రచార రథాలు నిలిచిపోయాయి. దీంతో జిల్లా ఒక్కసారిగా ప్రశాంతంగా మారింది. పార్వతీపురం నియోజకవర్గంలో సాయంత్రం ఆరు గంటలకు ప్రచారం నిలిపేశారు. సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో సాయంత్రం ఐదు గంటలకు ప్రధాన పార్టీ అభ్యర్థుల ప్రచారాలు ముగిశాయి. ఈ సారి ఎన్నికల నోటిఫికేషన్, పోలింగ్‌కు మధ్య చాలా సమయం ఉండడంతో అభ్యర్థులకు కలిసొచ్చింది. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు ఓ వైపు, వైసీపీ నాయకులు మరోవైపు జోరుగా ప్రచారాలు చేశారు. ప్రధానంగా కూటమి అభ్యర్థులు తమ పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టోలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాగా వారి ప్రచారాలకు అంతటా విశేష స్పందన వస్తుండడంతో ఎండను సైతం లెక్కచేయకుండా అనుచరులు, పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి ముందుకు సాగారు. మరోవైపు టీడీపీ, జనసేన పార్టీ అధినేతలు అధినేత చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కురుపాం, పాలకొండలో పర్యటించి వైసీపీ తీరును ఎండగట్టారు. తమ ప్రసంగాలతో పార్టీ శ్రేణులు, ప్రజల్లో జోష్ నింపారు. మొత్తంగా జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు, అరకు పార్లమెంట్ నియోజకవర్గ స్థానాలకు సంబంధించి ఎన్నికల బరిలో నిలిచిన కూటమి అభ్యర్థులు సుమారు నెల రోజులకు పైగా విస్తృతంగా పర్యటించి 'మన్యం'లో ప్రచారాలు నిర్వహించారు.

ప్రలోభాలకు తెరతీసిన అధికార పార్టీ..

ప్రచార పర్వం ముగియడంతో అధికార పార్టీ ప్రలోభాలకు తెరతీసింది. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో కొందరు వైసీపీ నాయకులు ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమాలకు, అనధికార ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కొన్ని నియోజకవర్గాల్లో ఓటుకు వెయ్యి రూపాయలతో పాటు క్వార్టర్ మద్యం బాటిల్‌ను అందిస్తున్నారు. మరికొన్నిచోట్ల ఓటుకు రూ.2వేల చొప్పున అందిస్తున్నట్లు తెలిసింది. కాగా మహిళలకు చీరలు, రూ.500 నగదు అందిస్తున్నట్లు సమాచారం. వాస్తవంగా కొంతమంది వైసీపీ నాయకులు ఎన్నికల ప్రక్రియ ప్రారంభిం నుంచే ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమాలను చేపట్టారు. నామినేషన్ ప్రక్రియ మొదలైన నాటి నుంచి నేటి వరకు జిల్లాలో మద్యం ఏరులై పారుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని బెల్ట్‌షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం, సారా విక్రయాలు జరుగుతున్నాయి. నామినేషన్ సమయాల్లో అయితే వైసీపీ శ్రేణులు మద్యం షాపుల వద్ద బారులుదీరిన పరిస్థితి. అయితే ఇప్పటికీ అదే సీన్ అంతటా కనిపిస్తోంది. జిల్లాలో కొంతమంది వైసీపీ నాయకులు బరితెగించి మద్యం, సారా, నగదు పంపిణీతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అధికారుల కంట పడకుండా ఈ తతంగం నడుపుతున్నారు.



ఏరులై పారుతున్న సారా..

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నాటుసారా ఏరులైపారుతుంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం నియోజకవర్గాలతో పాటు గ్రామీణప్రాంతాల్లో జోరుగా సారా విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలో తయారైన సారాతో పాటు పొరుగున ఉన్న ఒడిశా నుంచి యథేచ్ఛగా దిగుమతి చేసుకుని పల్లె, పట్టణ ప్రాంతాల్లో అమ్మకాలు చేపడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈ దందా మరింత జోరుగా సాగుతోందని ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు.

గతంలో ఎన్నడూ లేని పరిస్థితి..

ఈ సార్వత్రిక ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ జోరుగా సాగింది. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదు. ఓటమి భయంతో కొన్నిచోట్ల వైసీపీ నాయకులు ఈ కార్యక్రమాలకు తెరతీశారు. హోం ఓటింగ్ దరఖాస్తు చేసుకున్న వృద్ధులు, దివ్యాంగులకు డబ్బులతో గాలం వేశారు. కొంతమందికి ఓటుకు రూ.1500 నుంచి రూ.2 వేలు కూడా అందించారనే ఆరోపణలున్నాయి. పోలింగ్ కేంద్రాలకు వెళ్లగలిగే మరికొంతమంది దివ్యాంగులు, వృద్ధులకు కూడా నగదు అందించినట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతుంది.

అప్రమత్తత అవసరం..

ఎన్నికల ప్రచారానికి తెర పడినప్పటికీ.. సోమవారం పోలింగ్ ముగిసే వరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే అధికార పార్టీ వైసీపీ అల్లరి మూకలు పలు నియోజక వర్గాల్లో దౌర్జన్యాలు, దాడులకు తెగబడే అవకాశం ఉందనే వ్యాఖ్యలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని అధికారులు, పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, ప్రశాంత వాతావారణంలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

మూతపడ్డాయ్..


● ముందస్తుగానే మద్యం దుకాణాలు బంద్
● అధికార పార్టీకే ప్రాధాన్యం ● సీసాపై రూ. 10 అదనం

గరుగుబిల్లి/పాలకొండ, మే 11 : ఎన్నికల ప్రచారాలకు తెరపడడంతో శనివారం జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాలు మూతపడ్డాయి. సాయంత్రం 6 గంటలకు దుకాణాలు మూసివేయాలని ఆదేశాలు ఉన్నా.. చాలాచోట్ల ముందస్తుగానే మూసివేశారు. కాగా దుకాణాల పరిధిలో అధికార పార్టీ నాయకుల సిఫారసులకే అధిక ప్రాధాన్యం ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. పంచాయతీలవారీగా ఎంతమేర అవసరమో ఆ మేరకు అధికార పార్టీకి మద్యం అప్పగించారు. ఇతర వర్గాలకు అరకొరగా అందించిన పరిస్థితి ఏర్పడింది. మొత్తంగా సంబంధిత సిబ్బంది అధికార పార్టీ నేతల ఆదేశాలను తూచా తప్పకుండా పాటించారు. కొన్నిచోట్ల సిబ్బందికి చేయి తడిపితే నిబంధనలకు విరుద్ధంగా మద్యం సీసాలు అందించినట్లు తెలిసింది. మొత్తంగా అధికార పార్టీకి ఫుల్‌గా మద్యం అందిన పరిస్థితి ఏర్పడింది. సంబంధిత శాఖ పర్యవేక్షణ లోపంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై మందుబాబులు మండిపడ్డారు. అధికార పార్టీ వారికి నిబంధనలు వర్తించవా? అంటూ ప్రశ్నించారు. ఇదిలా ఉండగా పలు గ్రామాల్లోని బెల్ట్ దుకాణాల నిర్వాహకులు ఒకే సీసాపై అదనంగా రూ. 10లు చొప్పున వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. పాలకొండలో అయితే మద్యం దుకాణాల వద్ద శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మద్యం ప్రియులు బారులు తీరారు. క్యూలో నిలబడి మద్యం కోసం ఎగబడ్డారు. రెండు రోజుల పాటు మద్యం లభించదనే ఆలోచనతో మందుబాబులు మద్యం షాపులకు పరుగులు తీశారు.



గరుగుబిల్లిలో మూతపడిన మద్యం షాపు

సూపర్ సిక్స్ అదుర్స్



● టీడీపీ పథకాలకు జిల్లాలో విశేష స్పందన
● అన్ని వర్గాల వారు వాటిపైనే చర్చ
● ఉమ్మడి మేనిఫెస్టోపైనా హర్షం
● సామాన్య, మధ్యతరగతి వర్గాలకు ఎంతగానో దోహదపడతాయంటున్న 'మన్యం' వాసులు

పార్వతీపురం, మే11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు జిల్లాలో విశేష స్పందన వస్తోంది. అన్ని వర్గాల వారు ఇదే అంశంపై చర్చించుకుంటున్నారు. ఎన్నికల బరిలో నిలిచిన టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిగా అభ్యర్థులు కూడా సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. పల్లెలు, పట్టణ ప్రాంతాల్లో ప్రతిఒక్కరికీ సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఉమ్మడి మేనిఫెస్టో గురించి వివరించారు. దీంతో జిల్లావాసులు వాటిపైనే యోచిస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే.. ఆయా పథకాలు తమకెంతగా ఉపయోగపడతాయో చర్చిస్తున్నారు. ముఖ్యంగా నిరుద్యోగులు, యువత, మహిళలు, వృద్ధులు సూపర్ సిక్స్ పథకాలకు మద్దతు తెలుపుతున్నారు. వాటితో తమ భవిష్యత్ మారుతుందని వారు భావిస్తున్నారు. ప్రధానంగా నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు అందించనున్నట్లు చంద్రబాబు ప్రకటించడంతో యువత ఆనందం వ్యక్తం చేస్తోంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులు, ఇంటర్వ్యూలకు వెళ్లే వారు తల్లిదండ్రులపై ఆధారపడకుండా ఆ డబ్బులను వినియోగించుకోవచ్చని వారు భావిస్తున్నారు. ఇక స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు అందించే పథకంపైనా విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఏటా రూ.20 వేలు, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు , ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.15 వేలు తదితర సూపర్ సిక్స్ పథకాలపై ఆయా వర్గాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సామాన్య, మధ్య తరగతి వర్గాలకు ఆ పథకాలు ఎంతగానో ఉపయోగపడ తాయని వారు భావిస్తున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నామని వారు చెబుతున్నారు.వైసీపీ మేనిఫెస్టోలోని అంశాలన్నీ పాతవే కావడంతో కొత్తదనం లేదని ఖరాఖండి చెప్పేస్తున్నారు. మొత్తంగా టీడీపీ.. జనసేన.. బీజేపీ కూటమి ప్రకటించిన సూపర్-6 పథకాలు ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి.

రైతుల పక్షపాతి చంద్రబాబు



సూపర్‌సిక్స్ పథకాల్లో రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తామనడం ఆనందంగా ఉంది. టీడీపీ అధినేత చంద్రబాబు రైతుల పక్షపాతి.

- స్వామినాయుడు, రైతు, గరుగుబిల్లి మండలం

అవసరాలు తీరుతాయి..



18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల కింద నెలకు రూ.1500 ఇస్తామనడం ఎంతో ఆనందకరంగా ఉంది. కుటుంబంలో ఏదైనా అవసరాలు తీరేందుకు ఈ డబ్బులు ఉపయోగపడతాయి.

- కల్యాణి, పార్వతీపురం

అందరికీ ఉపయోగకరం

సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల్లో భాగంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ పథకం పేద సామాన్య, మధ్య తరగతి మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చార్జీలు భారీగా పెంచేయడంతో ప్రస్తుతం ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే ఆలోచించాల్సి వస్తోంది.

- కె.రామలక్ష్మి, పార్వతీపురం

మహిళలకు వరం



టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలు అద్భుతం. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం అనేది సామాన్య విషయం కాదు. నిజంగా చెప్పాలంటే మహిళలకు ఇది వరం. గతంలో చంద్రబాబు దీపం పథకం ప్రవేశపెట్టారు.

- పెద్దిరెడ్ల శ్రీవాణి, కారాడవలస, పార్వతీపురం మండలం

కుక్కల దాడిలో వృద్ధురాలి మృతి

● వెంకటరాజపురంలో ఘటన ● శోక సంద్రంలో కుటుంబ సభ్యులు



లక్ష్మి (ఫైల్)

జియ్యమ్మవలస, మే 11 : జియ్యమ్మవలస మండలం వెంకటరాజపురం గ్రామంలో శనివారం విషాదకర ఘటన చోటు చేసుకుంది. కుక్కల దాడిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. వెంకటరాజపురానికి చెందిన బంటు లక్ష్మి (70)కి కుమార్తె, కుమారులు ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు అయిపోవడంతో వేరే చోట జీవిస్తున్నారు. గ్రామంలో ఒంటరిగానే లక్ష్మి ఉంటుంది. కాగా శనివారం వేకువ జామున బహిర్భూమికని ఇంటికి సమీపంలోకి పొలాల వైపు ఆమె వెళ్లింది. ఆ సమయంలో అక్కడున్న కుక్కలు ఒక్కసారిగా ఆ వృద్ధురాలిపై దాడి చేశాయి. తలపై తీవ్రంగా గాయపర్చాయి. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కాసేపటి తర్వాత గ్రామస్థులు అక్కడికి రాగా.. ఆమె విగతజీవిగా పడి ఉండడం చూసి షాక్‌కు గురయ్యారు. వెంటనే మృతదేహాన్ని ఇంటికి తరలించారు. అయితే ఉదయం వరకు బాగానే ఉన్న వృద్ధురాలు కుక్కలు దాడి ఘటనలో చనిపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమె కుమార్తె, కుమారులు భోరున విలపించారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గత నాలుగు నెలలుగా కుక్కల బెడద ఎక్కువగా ఉన్నా.. సంబంధిత శాఖాధికారులు స్పందించకపోవడంపై బిత్రపాడు, బట్లభద్ర, నిమ్మలపాడు, పెదమేరంగి కూడలి, రామినాయుడు వలస, వెంకటరాజపురం, గవరమ్మపేట, బాసంగి బాసంగి గదబవలస వాసులు పెదవి విరుస్తున్నారు. కలెక్టర్ స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

గౌరీపురంలో ....

గౌరీపురం గ్రామంలో శనివారం సాయంత్రం ఓ కుక్క స్వైర విహారం చేసింది. 5వ తరగతి చదువుతున్న ఈదుబిల్లి పల్లవి, రాజాపు నారాయణరావు, రాజాపు ఎర్రమ్మ, గేదెల శివున్నాయుడు, ఆవు, దూడను గాయాలపాల్జేసింది. కాగా బాధితులంతా పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి వెళ్లారు.

పోలింగ్ సామగ్రి పంపిణీకి సన్నాహాలు

సాలూరు రూరల్/కురుపాం, మే 11: పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో శనివారం సాలూరులో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఏర్పాట్లను ఆర్వో విష్ణుచరణ్ పర్యవేక్షించారు. నియోజక వర్గంలో 243 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేయగా, వాటిని 32 సెక్టార్లుగా విభజించారు. పోలింగ్ సామాగ్రిని ఎన్నికల సిబ్బంది సజావుగా అందించడానికి పది పోలింగ్ స్టేషన్లుకు ఒక కౌంటరును ఏర్పాటు చేశారు. ఆ కౌంటర్‌లో పీవో,ఏపీవో, నలుగురు ఓపీవోలు ఉంటారు. వారికిచ్చిన సామగ్రిని పరిశీలించుకోవాల్సి ఉంది. ఎన్నికల సిబ్బంది రాగానే ముందుగా హాజరు నమోదు చేసుకొని వారికి కేటాయించిన పీఎస్‌కు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఎన్నికల సామగ్రి పోలింగ్‌స్టేషన్లుకు చేరవేయడానికి వాహనాలను సిద్ధం చేశారు. పోలింగ్ సిబ్బందిని వీలైనంత త్వరగా పంపిణీ కేంద్రం నుంచి పోలింగ్ స్టేషన్లకు తరలించడానికి కార్యాచరణ చేశారు. పోలింగ్ సిబ్బందికి పోలింగ్‌స్టేషన్ల కేటాయింపు సైతం పూర్తి చేశారు. పోలింగ్ సిబ్బందికి ఆది వారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు పోలింగ్‌స్టేషన్‌లో ఆహారం అందించే ఏర్పాట్లు చేశారు. పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పన పనులు పూర్తి చేశారు. భద్రత ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.



సాలూరులో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఆర్వో

● కురుపాం జూనియర్ కళాశాల ఆవరణలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీవీ రమణ ఆధ్వర్యంలో 16 స్పెషల్ కౌంటర్లు, 16 జనరల్ కౌంటర్లు సిద్ధం చేశారు. 268 పోలింగ్ కేంద్రాలకు చెందిన సిబ్బందికి ఆదివారం ఈవీఎంలు, ఇతర సామగ్రి అందించనున్నారు.



కురుపాంలో కౌంటర్లు ఏర్పాటు చేసిన దృశ్యం

నిర్వహణ ఖర్చులపై అసంతృప్తి

గరుగుబిల్లి/భామిని, మే 11 : ఎన్నికల సిబ్బంది సౌకర్యాల కల్పనకు అందించే మొత్తాలు తక్కువగా ఉండడంతో నిర్వాహకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 13న పోలింగ్ జరగనున్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన సిబ్బందికి ఆది, సోమవారం రెండు రోజుల పాటు భోజన సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఇందుకోసం ప్రతి పోలింగ్ కేంద్రానికి రూ. 2 వేల చొప్పున నిర్వాహకులకు అందించారు. అయితే కేంద్రానికి పది మందికిపైగా సిబ్బంది ఉంటారని, రెవెన్యూ యంత్రాంగం ఇచ్చిన రూ. 2 వేలు ఏ మేర సరిపోతాయని కొంతమేర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా పోలింగ్ కేంద్రాల పరిధిలో టెంట్లు ఏర్పాటుకు రూ. 2 వేలు కేటాయించారు. భామిని మండలంలో 44 పోలింగ్ స్టేషన్లు ఉండగా అన్ని సౌకర్యాలు చూడాలని ఒక్కో బీఎల్‌వోకు రూ.4 వేలు అందించారు. అయితే పోలింగ్ వచ్చే అధికారుల భోజనాలు, టెంట్లు, తాగునీరు తదితర వాటికి ఆ మొత్తం ఎలా సరిపోతుందని కొంతమంది ప్రశ్నిస్తున్నారు. అయితే ఆర్‌వో ఆదేశాలు మేరకే ఆ మొత్తం అందజేస్తున్నామని తెలపడంతో ఏమీ చెప్పలేక.. చేయలేక అసంతృప్తితో బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాలకు వెనుదిరిగారు.

అందరూ ఓటేయండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

పార్వతీపురం, మే11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై శనివారం ఆయన కలెక్టరేట్‌లో మాట్లాడారు. అంతరాత్మ ప్రబోధం మేరకు జిల్లావాసులు ఓటు వేయాలని, ఎటువంటి ప్రలోభాలకు గురికావొద్దని సూచించారు. యువత, మహిళలు, గిరిజనులు, థర్డ్‌జెండర్లు ఓటు హక్కు వినియోగానికి ముందుకు రావాలన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. వివిధ కారణాల రీత్యా మిగతా మూడు నియోజకవర్గాల్లో సాయంత్రం ఐదు గంటలతో ఓటింగ్ ఆగిపోతుందన్నారు. శనివారం సాయంత్రం నుంచి జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులోకి వస్తుందని తెలిపారు. 13వ తేదీ రాత్రి ఏడు గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 604 ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయన్నారు. ఇందులో పోలీస్‌శాఖ 276, ఎక్సైజ్ 309, ఉద్యోగులపై మూడు, రాజకీయ నాయకులపై నాలుగు కేసులు ఉన్నట్లు తెలిపారు. రూ.2 కోట్ల విలువ ఉన్న 61 వేల మద్యం సీజ్ చేశామన్నారు. 2019 ఎన్నికల్లో సీజ్ చేసిన దానికి ఇది పది రెట్లు అని వివరించారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధి వరకు మా త్రమే వాహనాలు అనుమతి ఉంటుందన్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో ఏదో ఒక గుర్తింపు కార్డును చూపించి ఓటు వేయాలని సూచించారు. సెల్‌ఫోన్లు, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ తదితరులున్నారు.

ఎన్నికల సిబ్బందికి బస్సులు

జిల్లాలో ఎన్నికల విధులకు హాజరవుతున్న సిబ్బందికి ఆదివారం వేకుజామున నాలుగు గంటల నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కురుపాం, సాలూరు, పాలకొండ నియోజకవర్గ కేంద్రాలకు చేరుకోవడానికి గాను వాటిని ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సిబ్బంది తమ ఎన్నికల ఉత్తర్వులు చూపించి ఉచితంగా బస్సుల్లో ప్రయాణించొచ్చని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పీపుల్స్ మేనిఫెస్టో

రోడ్లు బాగు చేయాలి



సాలూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల రోడ్లు బాగు చేసేందుకు ప్రభుత్వం శ్రద్ధ చూపాలి. దండిగాం రోడ్డులో గుంతల వల్ల బొడ్డవలస, జనవరివలస వద్ద కొద్ది నెలల కిందట ఇద్దరు మృతి చెందారు. ఇటువంటి ప్రమాదాల నివారణకు గ్రామీణ ప్రాంతాల రోడ్లు బాగు చేయాలి. అటువంటి నాయకులనే ఎన్నుకోవాలి. తద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. నియోజకవర్గంలో చాలా గ్రామాలకు సరైన రోడ్లు కూడా లేవు. ఆయా గ్రామాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి. ఇందుకు ప్రభుత్వం, కొత్తగా ఎన్నికయ్యే ఎమ్మెల్యే కార్యాచరణ రూపొందించాలి.

\- ఆముజూరు శ్రీనివాసరావు, బొడ్డవలస

ఇద్దరిదీ ప్రత్యేక రికార్డు

- అత్యధిక ఆధిక్యతతో కెంబూరి విజయం
- స్వల్ప ఓట్ల మెజారిటీతో పైడపునాయుడు

చీపురుపల్లి: ఏడు దశాబ్దాలకు పైగా రాజకీయ చరిత్ర కలిగిన చీపురుపల్లి నియోజకవర్గంలో ఎన్నో వింతలు, చిత్ర విచిత్రాలు జరిగాయి. గెలుపు ఓటముల విషయంలో కొన్ని రికార్డులు నమోదయ్యాయి. 1971లో ఈ నియోజకవర్గం ఏర్పాటయ్యింది. 1972 నుంచి ఈ స్థానానికి ఎన్నికలు ప్రారంభమయ్యాయి. 1972 నుంచి 2019 వరకూ (ఉమ్మడి మద్రాసు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) రాష్ట్రాల్లో 13 సార్లు ఎన్నికలు జరగగా, 11 మంది ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. వీరిలో 1972లో భారత జాతీయ కాంగ్రెస్ తరపున పోటీ చేసిన రౌతు పైడపునాయుడు (పోలినాయుడు) కేవలం 2,965 ఓట్ల తేడాతో తమ సమీప ప్రత్యర్థి, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ముదుండి సత్యనారాయణరాజుపై విజయం సాధించారు. అదే విధంగా 1985లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన కెంబూరి రామ్మోహనరావు 32,297 ఓట్ల అత్యధిక మెజారిటీతో సమీప ప్రత్యర్థి మీసాల నీలకంఠంనాయుడుపై గెలుపొందారు. నియోజకవర్గ రాజకీయ చరిత్రలో 2,965 కంటే తక్కువ మెజారిటీ గానీ... 32,297 కంటే అత్యధిక మెజారిటీ గానీ ఇప్పటి వరకూ మరే ఇతర పార్టీలు సంపాదించకపోవడం గమనార్హం. ఈ ఇద్దరి పేరున ఈ రికార్డులు నమోదై ఉన్నాయి.

ఎన్టీవోడికే ఓటేశా

పెద్దల మాట



రాజాం రూరల్, మే 11: ఎన్టీవోడుకే (ఎన్టీఆర్) ఎక్కువ సార్లు ఓటేసిన గుర్తు. ఆయనే బాగా గుర్తున్నారు. ఆ రోజులే వేరు. ఇప్పుడంతా డబ్బే. అప్పట్లో ఎవరు మంచోళ్లో, ఎవరికి ఓటు వేయాలో పెద్దలు చెప్పేవారు. అలాంటి వాళ్లకే అందరూ ఓట్లేసేవారు. ఎవరు పోటీ చేసేవారో కనీసం తెలిసేది కాదు. 1920 ప్రాంతంలో నేను పుట్టాను. స్వాతంత్ర్యం వచ్చిన విషయం పది రోజుల తరువాత తెలిసింది. అప్పుడు అందరూ బెల్లం, పంచదార పంచిపెట్టారు. రాజాం నియోజకవర్గంలో అత్యంత సీనియర్ ఓటరుగా గత ఏడాది ఓటరు దినోత్సవం సందర్భంగా అధికారులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు నన్ను సత్కరించడాన్ని మరచిపోలేను.

\- గున్న రాజమ్మ(104), బుక్కా వీధి, రాజాం

అభివృద్ధి మాటే లేదు



మూతపడిన భీమసింగి చక్కెర కర్మాగారం

- అన్నింటా వైసీపీ ప్రభుత్వం విఫలం
- చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిన వైనం
- ఉన్న పరిశ్రమలు మూత.. కొత్తవి లేవు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి అటకెక్కింది. కనీసం వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులకు కూడా నిధులు విదల్చకపోవడంతో అనేక చోట్ల అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అప్పులు చేసి విచ్చలవిడిగా సంక్షేమ పథకాల పేరుతో ప్రభుత్వం పంపకాలు చేసింది. పంచినది కొంతయితే... వెనుకేసుకున్నది మరికొంత అంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఏది ఏమైనా అభివృద్ధిని పూర్తిగా విడనాడిన ప్రభుత్వంగా వైసీపీ చరిత్రలో నిలిచిపోతోంది. రైతు పక్షపాత ప్రభుత్వం అని చెప్పి కేంద్ర అందించిన పీఎం కిసాన్ యోజనతో కలిపి రైతు భరోసా కింద ఏడాదికి రూ.7500 మాత్రమే అందించి చేతులు దులుపుకుంది. దత్తిరాజేరు మండలం మానాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనులు నత్తనడకన సాగుతున్నాయి.

నరకానికి నకళ్లుగా రోడ్లు

వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడేళ్ల పాటు నరకాన్ని చూపించారు. విజయనగరం-పార్వతీపురం, పార్వతీపురం- రాయగడ, పార్వతీ పురం- కురుపాం, సాలూరు వెళ్లే రోడ్లు గుంతలతో నరకానికి నకళ్లుగా మారాయి. విజయనగరం నుంచి సాలూరు వెళ్లే మార్గం జాతీయ రహదారి 26 కావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విస్తరణ పనులు చేపట్టాయి.

వంతెనల పరిస్థితీ అంతే..

బొబ్బిలి, సీతానగరం, తెర్లాం మండలాల్లో ప్రతిపాదిత వంతెనలు సైతం పూర్తి చేయలేని పరిస్థితి. బొబ్బిలి-సీతానగరం మధ్య సువర్ణముఖి నదిపై రూ.11 కోట్లతో తలపెట్టిన వంతెన పనులు బిల్లులు చెల్లించక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. బిల్లులు చెల్లించి ఉంటే ఆరు నెలల కిందటే ఈ వంతెన వినియోగంలోకి వచ్చేది.

వ్యవసాయ పథకాలు మూలకు..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగుకు తీవ్ర నష్టం కలిగింది. నియోజకవర్గానికి ఒక రిగ్‌బోర్ అందించి రైతులకు వైఎస్ఆర్ జలసిరి పేరుతో వ్యవసాయ బోర్లు, పంపు సెట్లు అందిస్తామని ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారు. ఈ పథకం ముందుకు సాగలేదు. రైతులు రూ.10 శాతం చెల్లిస్తే మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వమే భరించి బిందు, తుంపర సేద్యం పరికరాలు, పైపులు అందించే వారు. కిరోసిన్ ఇంజన్లు, రోటావేటర్లు, ట్రాక్టర్లు ఇలా అనేక వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందించే కార్యక్రమాన్ని టీడీపీ చేపట్టి రైతులను ఆదుకుంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాలన్నీ మూలకుచేరాయి.

పరిశ్రమల మూత

పరిశ్రమల ద్వారానే ఉత్పాదక శక్తి పెరిగి అభివృద్ధికి దోహదం చేస్తుంది. మరోవైపు ఉద్యోగ అవకాశాలు పెరిగేందుకు పరిశ్రమల ప్రాధాన్యం ఉంది. వైసీపీ ప్రభుత్వం పరిశ్రమలను ఏర్పాటు చేయలేదు. ఉన్న పరిశ్రమలను మూయించేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ పైనే రైతులు జీవనం సాగిస్తున్నారు. రైతులు సంప్రదాయ పంటలు వేసి దిగుబడులు రాక నష్టపోతున్నారు. ఈ పరిస్థితిలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. బొబ్బిలి, భీమసింగి చక్కెర పరిశ్రమలను వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల కిందట మూసివేయించింది. టీడీపీ హయాంలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు విద్యుత్ రాయితీలతో ప్రోత్సహించారు. వైసీపీ ప్రభుత్వం ఇందుకు భిన్నంగా పరిశ్రమల మూత దిశగా పరిపాలన సాగించింది. జూట్ పరిశ్రమలు తేరుకునే విధానాన్ని కూడా అమలు చేయలేదు. సరికదా ఆ ప్రాంత ఎమ్మెల్యేల కనుసన్నల్లో పూర్తిగా జూట్ పరిశ్రమల స్థలాలు విక్రయించేందుకు సహకరించారు.

గిరిజన విశ్వ విద్యాలయం ఇలా...

గిరిజన విశ్వ విద్యాలయాన్ని టీడీపీ హయాంలో కొత్తవలస మండలం రెల్ల గ్రామం వద్ద నిర్మించాలని తలపెట్టింది. ఇందు కోసం 500 ఎకరాలు కేటాయించింది. ప్రహరీ పనులు కూడా చేపట్టారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో కొత్తవలస బదులు వేరే ప్రాంతానికి వర్సిటీని మార్చారు. అక్కడా ఒక్క అడుగు కూడా పనులు జరగలేదు. తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పుకునేందుకు ఆంధ్ర విశ్వ విద్యాలయం అనుబంధ భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడ ఉన్న ఆంధ్ర విశ్వ విద్యాలయం అనుబంధ పీజీ గ్రూపులను ఎత్తివేసి విశాఖ ఏయూలో కలిపేశారు. ఇలా గిరిజన విశ్వ విద్యాలయం నిర్మాణం జరగకపోగా.. ఏయూ అనుబంధ విభాగాన్ని ఎత్తివేయడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.



పూర్తికాని ప్రాజెక్టులు

నదుల ద్వారా వృథాగా పోతున్న నీటిని ఒడిసి పట్టి రైతుల క్షేత్రాలకు మళ్లించడంలో వైసీపీ ప్రభుత్వం వైఫల్యమైంది. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించింది. తోటపల్లి వంటి చివరి దశకు వచ్చిన ప్రాజెక్టు పరిధిలో కూడా పెండింగ్ పనులు పూర్తి చేయలేకపోయారు. చీపురుపల్లి, గజపతినగరం నియోజకవర్గాలకు మంత్రి బొత్స, ఆయన సోదరుడు బొత్స అప్పలనరసయ్య ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తమ పరిధిలో పూర్తి చేయాల్సిన కాలువ పనులలో పురోగతి సాధించలేకపోయారు. నెల్లిమర్ల నియోజకవర్గ రైతాంగానికి సాగునీరు అందించే తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు పూర్తి చేయించడంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు విఫలమాయ్యారు. భోగాపురం విమానాశ్రయ అవసరాలకు, విజయనగరం కార్పొరేషన్ ప్రజలకు తాగునీరు అందించేందుకు తారకరామతీర్థ సాగర్ ఆధారం. ఇటువంటి ప్రాజెక్టును పూర్తి చేయించడంలో స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా వెనుకబడ్డారు.



టీడీపీ హయాంలో గిరిజన వర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన(ఫైల్)

పోలింగ్‌లో ఏజెంట్లే కీలకం

- దొంగ ఓటర్లను గుర్తించే అవకాశం

(గరుగుబిల్లి)

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఏజెంట్లది కీలక పాత్ర. పోలింగ్ బూత్‌లో ఉన్న ఏజెంట్లందరూ ఒక్కటైపోతే దొంగ ఓటర్లు సులువుగా ఓటు వేసుకునే అవకాశం ఉంటుంది. అందుకే పార్టీ నాయకులు ఏజెంట్ల ఎంపిక విషయంలో చాలా అప్రమత్తంగా ఉంటారు. ఎవరైతే పార్టీకి విధేయులుగా ఉంటారో వారినే నియమిస్తారు. దొంగ ఓట్లు వేసే వారిని అడ్డుకోవడం... ఒక వేళ దొంగ ఓటు వేయడానికి ఎవరైనా వస్తే వారిని గుర్తించి పోలింగ్ అధికారులకు తెలియజేయడం వంటివి చేస్తుంటారు. ఓటర్లను పోలింగ్ ఏజెంట్లు గుర్తించిన తర్వాతే ఓటు వేసేందుకు పోలింగ్ సిబ్బంది అనుమతిస్తారు. వాస్తవంగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ అభ్యర్థుల తరపున ఏజెంట్లను నియమించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతిస్తుంది. ఇందుకు ముందస్తుగా వారి వివరాలను ఎన్నికల అధికారులకు అందజేయాలి. ఆ తరువాత ఎన్నికల అధికారి ఫొటో గుర్తింపు కార్డు ఇస్తారు. గతంలో ఎన్నికల అధికారుల ఫొటోలు లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేసేవారు. ఒకరి తరఫున మరొకరు ఏజెంట్లుగా వ్యవహరించే అవకాశం ఉన్నందున ఎన్నికల అధికారులు ఫొటో గుర్తింపు కార్డులను ఇస్తున్నారు.

నియామకం ఇలా

ప్రతి అభ్యర్థీ తమకు నమ్మకమైన వారి ఆధార్ కార్డు, మొబైల్ నెంబరుతో పాటు ఓటరు జాబితాలోని సీరియల్ నెంబర్ తీసుకుని ముందుగా పార్టీ కార్యాలయాలకు పంపిస్తారు. అక్కడి నుంచి అనుమతి వచ్చిన తరువాత ఎన్నికల అధికారులకు ఆ జాబితా అందజేస్తారు. వారి పరిశీలన అనంతరం ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా ఏ పోలింగ్ స్టేషన్‌లో ఏజెంటుగా వ్యవహరించాలి అనే వివరాలతో గుర్తింపు కార్డులను మంజూరు చేస్తారు. ఒక పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన గుర్తింపు కార్డు పొంది మరో కేంద్రంలో ఏజెంటుగా వ్యవహరించేందుకు అనుమతించరు.

- పోలింగ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి పోలింగ్ కేంద్రంలో గానీ.. ఆ పరిధిలో ఉండే గ్రామంలో ఓటరై ఉండాలి.
- ఓటు హక్కు లేని వారిని నియమించరు.
- పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి వచ్చే వారిని గుర్తించేందుకు మాత్రమే ఏజెంట్లను నియమిస్తారు. అంతేకానీ వారికి ఎలాంటి అధికారాలు ఉండవు.
- ఏజెంటుగా ఉన్న వారు పోలింగ్ కేంద్రంలో ఎలాంటి ప్రచారం చేయకూడదు.
- ఏదైనా పార్టీ తరపున కేంద్రంలో ప్రచారం చేస్తున్నట్లు పోలింగ్ సిబ్బంది గమనిస్తే ముందుగా హెచ్చరించిన తరువాత బయటకు పంపిస్తారు.
- ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక అభ్యర్థికి ఇద్దరు చొప్పున ఏజెంట్లును నియమించుకునే వీలుంది.
- ఇద్దరు ఏజెంట్లు ఒకేసారి ఉండేందుకు అనుమతించరు.
- లోక్‌సభ అభ్యర్థి తరపున ఇద్దరు, అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థి తరపున ఇద్దరు చొప్పున ఏజెంట్లను నియమిస్తారు.
- ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాలను చూడాల్సి ఉంటుంది.





విజయనగరంలో ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు



రామభద్రపురం: గజమాలతో బేబీనాయనను సత్కరిస్తున్న దృశ్యం



నెల్లిమర్ల: తరిమిలో ప్రచారం చేస్తున్న లోకం మాధవి

ఆఖరి రోజూ అదే ఉత్సాహంతో..

- కూటమి అభ్యర్థుల ప్రచారం
- ప్రజల నుంచి విశేష స్పందన

సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఆఖరి రోజైన శనివారం ఉదయం టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి... తాము అధికారంలోకి వస్తే ప్రవేశ పెట్టబోయే పథకాలను వివరించారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో కురుపాం టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి, పార్వతీపురం జిల్లా కేంద్రంలో టీడీపీ అభ్యర్థి విజయచంద్ర, నెల్లిమర్ల మండలం తరిమిలో జనసేన అభ్యర్థి లోకం మాధవి ప్రచారం చేశారు. విజయనగరంలో టీడీపీ అభ్యర్థి అదితిగజపతిరాజు, రామభద్రపురం మండలంలో బేబీనాయన ప్రచారంలో పాల్గొన్నారు.




గుమ్మలక్ష్మీపురం: కురుపాం కూటమి అభ్యర్థి తోయక జగదీశ్వరికి నేతల సంఘీభావం



పార్వతీపురం: జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న విజయచంద్ర

ఓటరు స్లిప్ లేదా.. ఆందోళన వద్దు



విజయనగరం: ఓటర్లకు బూత్‌ల వారీగా సిబ్బంది ఇంటింటికి తిరిగి స్లిప్పులు అందజేస్తున్నారు. ఈనెల 13న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తాత్కాలికంగా అందుబాటులో లేని వారి స్లిప్పులను సమీపంలోని కుటుంబాలకు అందజేశారు. మృతి చెందిన వారు, చిరునామా మారిన వారి స్లిప్పులు ఎక్కువ శాతం సిబ్బంది వద్దే ఉండిపోతున్నాయి. ఒకవేళ ఓటరు చీటీ రాకున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జాబితాలో పేరు ఉంటే నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఈసీ అనుమతించిన ఆధార్ కార్డు, ఫొటోతో కూడిన బ్యాంకు పుస్తకం, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, పాన్‌కార్డు తదితర గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానిని చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఈసారి వాటిపై క్యూ ఆర్ కోడ్ ముద్రించగా స్మార్ట్‌ఫోన్ ద్వారా స్కాన్‌చేస్తే ఓటరు వివరాలతోపాటు పోలింగ్ కేంద్రానికి సంబంధించి సమాచారం తెలుస్తుంది.

నజరానాలు స్వీకరించినా శిక్షే



విజయనగరం: ఎన్నికల్లో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు పలు విధాలుగా ఓటర్లను ప్రలోభ పెడుతుంటాయి. డబ్బు, మద్యం, చీరలు, క్రికెట్ కిట్లు, క్రీడా సామగ్రి, తదితర నజరానాలు ఇస్తుంటాయి. వీటిని పంచుతూ నాయకులు, అభ్యర్థులు పట్టుబడితే అధికారులు కేసులు నమోదు చేస్తుంటారు. కానీ వీటిని స్వీకరించడం లేదా స్వీకరించడానికి అంగీకరించడం కూడా ప్రజా ప్రాతినిధ్య చట్టం -1951 సెక్షన్ 123 ప్రకారం నేరమే అవుతుందని ఎన్నికల సంఘం పేర్కొంది. నజరానాలు స్వీకరించడం లేదా అంగీకరించినా ఐసీసీ సెక్షన్ 171 ప్రకారం జైలు లేదా జరిమానా, లేదా రెండూ కలిపి విధించే అవకాశం ఉంది.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
ఆదివారం 12 మే 2024

దేవుడా.. గెలిపించాల్సింది నీవే!

(విజయనగరం)

కొందరు అభ్యర్థులు తమ గెలుపు భారాన్ని దేవుళ్లపై వేశారు. తమను గెలిపించాలని దేవుళ్లను ప్రార్థించి ముడుపులు కట్టుతున్నట్లు తెలుస్తోంది. గెలిచిన తర్వాత మీ సన్నిధికి వచ్చి ముడుపులు చెల్లిస్తానని పూజలు చేస్తుండడం కనిపిస్తోంది. అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులు కూడా దేవుళ్లను మొక్కుతున్నారు. ఇదిలా ఉండగా... సోమవారం పోలింగ్ అనంతరం జూన్ 4న ఫలితాలు వెలువడే వరకు తమకు టెన్షన్ తప్పదని అభ్యర్థులు చెబుతున్నారు. ప్రచారంలో తమకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని, ఫలితాలు అనుకూలంగా ఉంటాయని ఒకవైపు చెబుతున్నా... లోలోపల వారిలో టెన్షన్ కనిపిస్తోంది.

పోలింగ్‌లో పీవోనే కీలకం

- పీవోలు, ఏపీవోలు అప్రమత్తంగా ఉండాల్సిందే
- పీడీఎంఎస్ యాప్‌తో ఎన్నికల నిర్వహణ
- మార్గదర్శకాలు జారీచేసిన ఎన్నికల సంఘం





(విజయనగరం)

పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి(పీవో) కీలకం. ఆయన ఆధీనంలో ఉంటుంది. ఇక్కడ పీవోదే తుది నిర్ణయం. ఈవీఎంల మార్పు, పోలింగ్ నిలుపుదల, కొనసాగింపు, వాయిదా, భద్రత,పోలింగ్ ఏజెంట్లపై చర్యలు, చాలెంజ్ఓటుపై ప్రిసైడింగ్ అధికారిదే తుది నిర్ణయం. సోమవారం జరిగే పోలింగ్‌నకు ఇప్పటికే పీవో, ఏపీవోలకు నాలుగు సార్లు శిక్షణఇచ్చారు. పోలింగ్ ముందురోజు నుంచి పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్‌రూము కౌంటర్లకు అప్పగించే వరకూ పూర్తి బాధ్యతలను అప్పగించారు. ఎన్నికల విధులు ఏ విధంగా నిర్వహించాలి, ఎలా చేపట్టాలి అన్న విషయంపై పీవోలు, ఏపీవోలు అనుస రించాల్సిన విధానాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాలను జారీచేసింది. పీవో,ఏపీవో పోల్‌డే మోనటరింగ్ సిస్టం యాప్‌తో అనుసంధానం చేస్తూ విధులు నిర్వహించాలి.

పోలింగ్ ముందు రోజు

ఎన్నికల విధుల్లో పాల్గొన్న పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు ఇతర సిబ్బంది తమకు కేటాయించిన నియోజకవర్గంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఉదయం ఎనిమిది గంటలకు చేరు కోవాలి. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏ సెక్టోరియల్ పరిధి, పోలింగ్ కేంద్రం కేటాయించారో సమాచారం కేంద్రాల్లో తెలుసుకోవాలి. తర్వాత సెక్టోరియల్ అధికారులు రిపోర్టు ఇచ్చి ఎన్నికల అధికారులు ఇచ్చిన సామగ్రిని తీసుకోవాలి. ఈ సామగ్రి చెక్‌లిస్టును ఒకటికి రెండుసార్లు పరిశీలించాలి. ఏదైనా లేక పోతే సెక్టోరియల్ అధికారికి తెలియజేస్తే వారికి సామగ్రి అంద జేస్తారు. వాహనాలు బయలు దేరిన సమయంలో పీడీ ఎంఎస్ యాప్ ద్వారా గమ్యస్థానం వివరాలు తెలియజేసి యాప్‌ను వినియోగించడం ప్రారంభించాలి. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు చేరిన తర్వాత ఫారం-7ఏ పోటీచేసే అభ్యర్థుల వివరాలు పోస్టర్ అంటించాలి. ఫారం-10 ఏజెంట్ల నుంచి వారీ నియామకపు లేఖలు తీసుకోవాలి. ఎనక్షర్-12 ఏజెంట్లకు ఎంట్రీ పాస్‌లు ఇవ్వాలి. ఎనక్షర్-13 ఏజెంట్ల ఎంట్రీ పాస్‌ల ఖాతా రాయాలి.

5.30 నుంచి మాక్‌పోలింగ్

అభ్యర్థుల తరపున నియమించిన ఏజెంట్ల సమక్షంలో ఉదయం 5.30 నుంచి 6.30లోగా కనీసం 50 ఓట్లతో మాక్ పోలింగ్ నిర్వహించి ఓట్లను లెక్కిస్తారు. మాక్ పోలింగ్‌లో కూడా నోటా ఆప్షన్ ఉంటుంది. మాక్ పోలింగ్, ఓట్ల లెక్కింపులో ఏమైనా తేడాలు వస్తే సంబంధిత ఈవీఎంలను మార్చి కొత్త ఈవీఎంలను ఏర్పాటు చేస్తారు. మాక్ పోలింగ్ సక్రమమేనని నిర్ధారణ అయితే ఈవీఎంలను ఏజెంట్లు సమక్షంలోనే జీవో చేసి సరిగా ఉదయం ఏడుగంటలకు ప్రారంభిస్తారు.

ఈవీఎంలు మొరాయిస్తే

ఈవీఎంలు మొరాయిస్తే పోలింగ్‌కు అంత రాయం కలుగుతుంది. ఓటింగ్ జరగాలంటే ఈవీఎంలో కంట్రోల్ యూనిట్(సీయూ)వీవీప్యాట్, బ్యాలెట్‌యూనిట్ (బీయూ) మూడు సక్రమంగా పనిచేయాలి. సీయూ, బీయూ పనిచేయకపోతే వాటితోపాటు వీవీప్యాట్‌ను మార్చి మాక్ పోలింగ్‌తో తనిఖీ చేస్తారు. సీయూ బ్యాటరీ, వీవీ ప్యాట్ పనిచేయకపోతే వాటిని మాత్రమే మారుస్తారు. మాక్ పోలింగ్ అవసరం ఉండదు. పోలింగ్ మధ్యలో మొరాయించినా ఈవీఎంలకు మరమ్మతులు చేసినా ప్రారంభంకాకపోతే కొత్త ఈవీఎంను ఏర్పాటుచేస్తారు. అయితే అప్పటి వరకు పోలైన ఓట్ల వీవీ ప్యాట్లను భద్రపరుస్తారు. ఓట్ల లెక్కింపు అనంతరం వీవీ ప్యాట్లతో ఫలితాలు తారుమారు అయ్యే అవకాశం ఉంటేనే ఈ వీవీ ప్యాట్లను లెక్కిస్తారు. అలాగే వేసిన ఓటును ఏడు సెకండ్ల వ్యవధిలో పరిశీలించుకునే అవకాశం ఓటరుకు లభిస్తుంది. ఏమైనా తేడా అనిపిస్తే ప్రిసైడింగ్‌అధికారికి పిర్యాదు చేయవచ్చు.

కరెంట్ పోతే ఈవీఎం పనిచేయదా ?

కరెంట్‌పోతే ఈవీఎం పనిచేయదా? ఓటు వేసే సమయంలో కరెంట్ పోతే ఈవీఎం పని చేస్తుందా? లేదా అన్న సందే హాలు చాలామందిలో ఉండొచ్చు. అయితే భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ రూపొందించిన ఈవీఎంలు విద్యుత్ కనెక్షన్ లేకపోయినా పనిచేస్తాయి. సాధారణ 7.5 వోల్ట్ ఆల్కలిన్ పవర్‌ప్యాక్‌తో పనిచేస్తాయని ఆయా కంపెనీలు ప్రకటించాయి.



రెండు గంటలకోసారి పోలింగ్ శాతం

పోలింగ్ ప్రారంభించిన తర్వాత ప్రతి రెండు గంటలకోసారి అధికారులు పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తారు. మార్కింగ్ చేసిన జాబితా, ఓటరు స్లిప్పులు, సీయూ లెక్కలను సరిచూసిన తర్వాతే పోలింగ్ శాతాన్ని ప్రకటిస్తారు. ఉదయం 9, 11, ఒంటిగంట, సాయంత్రం మూడు గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత తుది శాతాన్ని వెల్లడిస్తారు. ప్రిసైడింగ్ అధికారులు సెక్టారు అధికారుల ద్వారా జిల్లా అధికారులకు నమోదైన పోలింగ్ శాతాన్ని చేరవేస్తారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు తెలియజేస్తారు.

ప్రత్యేక గుర్తులతో మార్కింగ్

పురుషులు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు మూడు రకాలుగా ఓటర్లను విభజించారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటరు ఆధారంగా అదనపు ప్రిసైడింగ్ అధికారి ఓటరు జాబితాలో మార్కింగ్ చేస్తారు. పురుషులు వస్తే అడ్డగీత, మహిళలు వస్తే అడ్డగీతతో పాటు వారి ఓటరు క్రమసంఖ్యకు వృత్తం చుడతారు. ట్రాన్స్‌జెండర్లు వస్తే అడ్డగీతతో పాటు వారిక్రమ సంఖ్యకు స్టార్ గుర్తు వేస్తారు. ఈ విధానంతో కేటగిరి వారీగా పోలింగ్ శాతాన్ని లెక్కించడం సులువు అవుతుంది.

ఆరు గంటల వరకే అనుమతి

సాయంత్రం ఆరుగంటలకు పోలింగ్ ముగిస్తుంది. అప్పటి వరకే ఓటర్లను పోలింగ్‌కేంద్రంలోకి అనుమతి ఇస్తారు. పోలింగ్ కేంద్రంలో ఉన్నవారంతా ఓటు వేసేవరకు పోలింగ్ కొనసాగుతుంది. పోలింగ్ ముగిసిన వెంటనే పీవో సీయూలో క్లోజ్ బటన్ నొక్కుతారు. అనంతరం పోలైన ఓట్లలెక్కలు సరిచూసుకుంటారు. సరిచూసుకొని సీయూ స్విచ్ ఆఫ్ చేసి వీవీప్యాట్, బ్యాలెట్ యూనిట్లను డిస్‌కనెక్ట్ చేసి వీవీ ప్యాట్ నుంచి బ్యాటరీ తీసివేస్తారు. పోలింగ్‌ప్రారంభంలో సీయూ, వీవీ ప్యాట్‌కు వేసిన సీలు సక్రమంగానే ఉన్నాయని పరిశీలించాక, పోలింగ్ ఏజెంట్లతో సంతకాలు తీసుకుంటారు. అనంతరం సీలు వేసి క్లోజ్ చేసిన సీయూ, బీయూ , వీవీ ప్యాట్లను ప్రత్యేక భద్రత నడుమ ఓట్ల లెక్కింపు కేంద్రాలలోని స్ట్రాంగ్ రూములకు తరలిస్తారు.

ఇలా ప్రారంభం

- ఉదయం ఏడు గంటలకు సీయూ స్విచ్ ఆన్ చేయాలి. (అసెంబ్లీ, పార్లమెంట్ సీయూలు ఒకేసారి) వీవీప్యాట్‌లో జారిపడే ఏడు స్లిప్పులను ఏజెంట్లను పరిశీలించాలని చెప్పాలి. తర్వాత టోటల్ బటన్ నొక్కి మొత్తం ఓట్లు సున్నా అనిచూపి పోలింగ్‌ను ప్రారంభించాలి. పీవో ఎనక్షర్-6లో పోలింగ్ ప్రారంభించామని రాయాలి. అనంతరం పోలింగ్ ప్రారంభించాలి.
- ఏపీవో మార్క్డు కాపీ పనిచూడాలి. ఓపీవో-1 17ఏ ఓటర్ల రిజిస్టర్ రాసి ఇంక్‌పెట్టాలి. ఓపీవో-2 ఓటరు స్లిప్పులు రాయాలి. ఓపీవో-3 పార్లమెంట్ కంట్రోల్ యూనిట్ బాధ్యత. ఓపీవో -4 అసెంబ్లీ కంట్రోల్ యూనిట్ బాధ్యత. పీవో ప్రతి రెండు గంటలకు పోలింగ్ అయిన ఓట్లును నమోదు చేసుకోవాలి.
- పోలింగ్ పూర్తయిన తర్వాత టోటల్ బటన్ నొక్కి ఓట్ల సంఖ్య సరిచూసుకోవాలి. తర్వాత క్లోజ్ బటన్ నొక్కాలి. ఎనక్షర్-6 పార్ట్-3 పూర్తి చేయాలి.
- పీడీఎంఎస్‌లో పోలింగ్ పూర్తయినట్లు నమోదుచేయాలి. ఈవీఎంలను సీల్ చేయాలి
- ఎనక్షర్-8 (ఫారం-17 సి) పూర్తి చేయాలి. ఏజెంట్ల అందరికీ కాపీలు ఇవ్వాలి.
- రిసెప్షన్ కేంద్రానికి చేరుకోగానే పీడీఎంఎస్ యాప్‌లో నమోదుచేయాలి. కౌంటర్ల వద్ద మెటీరియల్ ఇచ్చినట్లు ఎనక్షర్ -22 తీసుకోవాలి. పీవో డైరీలను అసెంబ్లీకి, పార్లమెం ట్‌కు వేర్వేరుగా తయారుచేసి రెండుకాపీలు ఇవ్వాలి. అవస రమైన చోట ఎనక్షర్ -14, 15,16,18,19, 20లను పూర్తి చేయాలి. అలాగే ఇతర ఫారాలు పూర్తిచేసి ఇవ్వాలి.

పోలింగ్ ప్రారంభానికి ముందు..

- పీడీఎంఎస్ యాప్ ఓపెన్ చేసి పోలింగ్ స్టేషన్, నెంబరు, మండలం, నియోజకవర్గం తదితర వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేయాలి
- మాక్‌పోల్ టాలీషీట్స్ తయారుచేసుకోవాలి (అసెంబ్లీ, పార్లమెంట్లకు విడివిడిగా) తర్వాత బీయూను వీవీప్యాట్‌కు, వీవీప్యాట్‌ను కంట్రోల్ యూనిట్ (సీయూ)కు ఉదయం 5.30 గంటలకు కనెక్ట్ చేయాలి. వీవీప్యాట్ వెనుకఉన్న నల్లటి మీటను నిలువుగా తిప్పి సీయూ ఆన్‌చేయాలి. అనంతరం మాక్‌పోల్‌ను ప్రారంభించాలి.ఈ పోలింగ్‌లో వీవీప్యాట్ నుంచి జారిన ఏడు స్లిప్పులను చూడాలి. క్లోజ్ రిజల్ట్ క్లియర్(సీఆర్సీ)చేయాలి. తర్వాత పోటీలోని అభ్యర్థులకు నోటాతో కలిపి సమానంగా 50 ఓట్లను ఏజెంట్లతో వేయిం చాలి. (అసెంబ్లీ, పార్లమెంట్‌కు విడివిడిగా, ఒకేసమయంలో)
- 50 ఓట్లు వేసిన తర్వాత క్లోజ్ బటన్ నొక్కాలి. ఆపై రిజల్ట్ బటన్‌నొక్కాలి. ఎనక్షర్ -5 పార్ట్:1 మాక్ పోల్ సర్టిఫికెట్ నింపాలి. తర్వాత సీయూలో క్లియర్ బటన్‌నొక్కాలి. ఆపై టోటల్ బటన్ నొక్కి సున్నాచూపాలి. తర్వాత కంట్రోల్ యూ నిట్ స్విచ్ ఆఫ్ చేయాలి. దీంతో మాక్ పోలింగ్ పూర్తవుతుంది. వీవీప్యాట్‌లో నుంచి మాక్‌పోల్ స్లిప్ (57) తీసివేసి లెక్కించి స్లిప్‌లు వెనుక మాక్‌పోల్ అన్న స్టాంప్ వేసి కవర్ లో పెట్టిసీల్‌చేయాలి. పీవో ఈ కవర్‌పై ఏజెంట్లతో సంతకం చేయించాలి.
- సీయూను గ్రీన్‌పేపర్ సీల్ (ఎ,బి), క్లోజ్ బటన్ వద్ద స్పెషల్ ట్యాగ్‌తో సీల్‌చేయాలి. వాటి మీదఉన్న నంబర్లను రాసుకోవాలి. వాటిపై పీవో, ఏజెంట్ సంతకాలు చేయాలి. సీయూకు పక్కన అడ్రాస్ ట్యాగ్ కట్టాలి. వీవీప్యాట్‌లోని స్లిప్పులు జారిపడే గది తలుపునకు ఇరువైపుల అడ్రాస్ ట్యాగ్‌కట్టి సీల్ వేయాలి.

ఓటు బాటలో..

- పట్నం నుంచి పల్లెకు పయనం
- కదలివచ్చిన వలసజీవులు

ఈసారి ఎన్నికలు ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ఓటర్లూ ఎన్నికలను అలాగే భావిస్తున్నారు. దీంతో ఎక్కడెక్కడో ఉన్న వారంతా సొంతూళ్లకు చేరుకుంటున్నారు. విదేశాలలో ఉన్న వారు సైతం ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వగ్రామాలకు వస్తున్నారు. వారి అభిప్రాయాలు తెలుసుకుందాం.

దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణ ఓటుతోనే సాధ్యం



బొబ్బిలి: దుష్టులకు సరైన శిక్ష వేసి.. శిష్టులను రక్షించాలంటే ఓటు అనే పదునైన ఆయుధాన్ని ప్రజలంతా వాడాల్సిందే. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం మనందరికీ ప్రసాదించిన హక్కు. భవిష్యత్‌ను నిర్దేశించేది ఓటు హక్కు మాత్రమే. ఇంత ప్రాధాన్యం కలిగిన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఖండాంతరాలు, సముద్రాలు, దేశాలు దాటి రావాల్సిందే. ఆ చైతన్యం అందరిలో నిండాలి. నేను ఉదయ్‌పూర్ (రాజస్థాన్)లో మెడిసిన్ పీజీ కోర్సు చదువుకుంటున్నాను. ఓటు హక్కును వినియోగించుకునేందుకు అక్కడి నుంచి బొబ్బిలి వచ్చాను.

- డాక్టర్ గునుపూరు హేమంత్ కుమార్, బొబ్బిలి

రాష్ట్రాలు దాటి...



సాలూరు రూరల్: ఏపీలో ఎన్నికల్లో ఓటు వేయడానికి ఉత్సాహంతో రాష్ట్రాలు దాటి వచ్చాను. పూణేలో ఇన్ఫోసిస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్నాను. రాష్ట్రంలో పరిస్థితులు కలచివేశాయి. రాష్ట్ర మేలు కోసం ఓటు వేయాలనే లక్ష్యంతో వచ్చాను.

- ఆదిమూలం పవన్, సాలూరు

ఎదురు చూస్తున్నా



కొత్తవలస: మొట్టమొదటిసారిగా నా ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం హైదరాబాద్ నుంచి వచ్చా. ప్రస్తుతం అక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆత్రంగా ఎదురు చూస్తున్నా. ఓటు వేయడం మన బాధ్యత.

- గంటి సారిక, కొత్తవలస

తొలిసారిగా వినియోగించుకుంటున్నా...



బొబ్బిలి: నేను కోల్‌కత్తాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. తొలిసారి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం దక్కింది. నాకు ఇష్టమైన వ్యక్తులకు స్వేచ్ఛగా ఓటు వేస్తున్నానన్న భావన నాలో ఉంది. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ సమానమైన ఓటు హక్కు రాజ్యాంగం కల్పించడం గొప్ప విశేషం. ప్రలోభాలకు గురికాకుండా అందరూ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకొని సమాజహితమే ధ్యేయంగా మెలగాలి.

- జి.వంశీకృష్ణ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, బొబ్బిలి

ఓటు కోసం ఖండాలు దాటి...



జ్యోతి

సాలూరు రూరల్: మన రాష్ట్రంలో ఈ దఫా ఎన్నికలు విశ్వవ్యాప్తంగా కాక పుట్టిస్తున్నాయి. గతంలో ఇక్కడి ఎన్నికలకు ఎన్ఆర్ఐలు, విదేశాల్లో ఉన్నవారు తరలివచ్చి ఓటు వేసిన సంఘటనలు అరుదు. ప్రసుత్త ఎన్నికల్లో ఓటు వేసేందుకు విదేశాల్లో ఉన్న ఏపీ వాసులు స్వచ్ఛందంగా తరలి వస్తుండడం విశేషం. స్వీడన్‌లోని స్టాక్‌హోంలో ఉంటున్న సాలూరుకు చెందిన దంపతులు ఓటు వేయడానికి ఇక్కడికి చేరుకున్నారు. సాలూరుకు చెందిన నులకల జ్యోతికి డెంకాడ మండలం గొలగాంకు చెందిన నడుకూరి శివతో రెండేళ్ల క్రితం వివాహమైంది. స్టాక్‌హోంలో హెచ్ అండ్ ఎం కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. మన రాష్ట్రంలో ఈ నెల 13న పోలింగ్ ఉండడంతో ఓటు వేయడానికి వ్యయ ప్రయాసలకు లెక్క చేయకుండా స్వగ్రామాలకు చేరుకున్నారు. జ్యోతికి సాలూరులో... శివకు గొలగాంలో ఓట్లు ఉన్నాయి. రాష్ట్రాభివృద్ధి కోసమే తాము ఓటు వేయడానికి నిశ్చయించుకున్నామని శనివారం ఆమె తెలిపారు.

హౌరా రైలెక్కి..

సాలూరు రూరల్: ఓటు వేయాలనే లక్ష్యంతో హౌరా రైలుకు రిజర్వేషన్ చేసుకున్నాను. రాష్ట్రంలో ఉపాధికి లోటు ఏర్పడింది. ఇక్కడ పనులు లేక చెన్నైలో పనులకు వెళ్లాను. నాలాగే ఎందరో వెళుతున్నారు. రాష్ట్రంలో పరిస్థితులు మారాలి. అందుకే ఓటు వేయడానికి వచ్చాను.

- పల్లా బంగారురాజు, తాపీ మేస్త్రీ, మామిడిపల్లి

రేపటి కోసం 'మందు' చూపుతో...

విజయనగరం (ఆంధ్రజ్యోతి), మే 11: ఈ నెల 13న సోమవారం సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మద్యం షాపులు, బార్లకు వరుసగా రెండు రోజులు సెలవులు ప్రకటించారు. దీంతో ముందుగానే ఇంట్లో స్టాకు పెట్టుకునేందుకు మందుబాబులు శనివారం ఉదయాన్నే షాపుల వద్ద బారులు తీరారు. ఉదయం 11 గంటల నుంచి విక్రయాలు మొదలు పెట్టడంతో అందిన కాడికి కొనుక్కుని వెళ్లారు. జిల్లాలోని 145 మద్యం షాపులు, 23 బార్ల వద్ద దాదాపు ఇదే పరిస్థితి కనిపించింది.



మద్యం కోసం మండుటెండలో ఇలా..

తొలిసారి 499 లోక్‌సభ స్థానాలకే పోలింగ్

(విజయనగరం)

మీకు ? తెలుసా



దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం 1952లో మొదటిసారి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. తర్వాత 22 రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. మొదట్లో 21 ఏళ్లు నిండిని వారికి ఓటుహక్కు కల్పించారు. 4,500 శాసనసభ, 499 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. తొలి సార్వత్రిక ఎన్నికల్లో 17 కోట్లమంది ఓటర్లు పాల్గొన్నారు. ఇందులో 85 శాతం మంది నిరక్షరాస్యులే. బ్యాలెట్ పేపర్లపై అభ్యర్థుల పేర్లతో పాటు గుర్తులు ముంద్రించారు. కాంగ్రెస్, సోషలిస్టు పార్టీ, భారతీయ జనసంఘ్, కమ్యూనిస్టు పార్టీలు పాల్గొన్నాయి. కాంగ్రెస్ పార్టీ 364, కమ్యూనిస్టులు 16, భారతీయ జనసంఘ్ మూడు, మిగతా స్థానాల్లో ఇతర పార్టీలు గెలిచాయి. దేశానికి మొదటి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ బాధ్యతలు చేపట్టారు.

మూగబోయిన మైకులు.. ఆగిపోయిన డప్పులు!





ప్రచార వాహనాలపై స్టిక్కర్లు, మైక్‌లు తొలగిస్తున్న దృశ్యం



విజయనగరం (ఆంధ్రజ్యోతి), మే 11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత 50 రోజుల నుంచి డీజే సౌండ్‌లు... డప్పుల చప్పుళ్లతో ఊరూవాడా హోరెత్తాయి. ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగియడంతో మైకులు మూగబోయాయి. డప్పుల శబ్దాలు ఆగిపోయాయి. ఎన్నికల అధికారులు ఎక్కడికక్కడ పకడ్బందీ చర్యలు చేపట్టటంతో ప్రచార హోరు నిలిచిపోయింది. కార్లు, వ్యాన్లకు కట్టి ఉంచిన జెండాలు, పార్టీల స్టిక్కర్లు తొలగించారు.

పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం: జగదీశ్వరి


ఇంటింటి ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: గిరిజనుల అభివృద్ధికి, పేదల అభ్యున్నతికి టీడీపీ కట్టుబడి ఉందని కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేట గ్రామంలో ఆమె శనివారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. జీవో నెంబర్-3ను పునరుద్ధరిస్తామని చెప్పారు. మారుమూల గిరిజన గ్రామాల్లో పక్కా ఇళ్లు నిర్మిస్తామని, రహదారులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పూర్ణపాడు-లాభేసు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, ఒట్టిగెడ్డ సాగునీటి పథకాన్ని నిర్మిస్తామని ఆమె హామీ ఇచ్చారు. యూత్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా గిరిజన యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పనా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ ప్రచారంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, పార్టీ నాయకులు సుధ, బిడ్డిక పద్మ తదితరులు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి, అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను గెలిపించాల ని కోరుతూ ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్‌కుమార్, పార్టీ ప్రతినిధి ఆర్నిపల్లి గంగాధర్‌నాయుడు శనివారం రావివలసలో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థికి సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థికి కమలం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ గౌరమ్మలు దత్తివలస, కారివలస, చిలకాం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ● **గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాలైన వంగర, కేసర, డోలుకోన, కీసరగూడ రెల్లమల్లుగోడ తదితర గిరిజన ప్రాంతాల్లో కూటమి అభ్యర్థుల కోసం ప్రచారం చేశారు. బీజేపీ నాయకుడు సింహాచలం మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరిని, అరకు బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో కురుపాం నియోజకవర్గ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సోనాలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

నియోజవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

● కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర


ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతిని చించివేస్తున్న విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా కేంద్రంలో కూటమి అభ్యర్థి బోనెల విజయ చంద్ర ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. తనకు సైకిల్ గుర్తుపై, అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ర్యాలీలో పట్టణంతో పాటు బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మం డలాల నుంచి భారీ సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బెలగాం జయ ప్రకాష్‌నారాయణ, బార్నాల సీతారాం, గొట్టాపు వెంకటనాయుడు, జి.రవికుమార్, బోను దేవి చంద్రమౌళి, అనూష, నిర్మలాకుమారి, పెద్దిరెడ్డి శ్రీవాణి, మజ్జి వెంకటేష్, సునీల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఎ.మోహన్‌రావు పాల్గొన్నారు. ● పార్వతీపురంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో ఆరో వార్డు వైసీపీ కౌన్సిలర్ మజ్జి పారినాయుడు తన అనుచరులతో టీడీపీలో చేరారు. బార్నాల సీతారాం, సునీల్, నారాయణ రావు పాల్గొన్నారు. ● ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ భూ యజమానులకు ఉరితాడు లాంటిదని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం పార్వతీపురంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పత్రాలను చించివేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. ● **సీతానగరం:** పెదభోగిల మాజీ ఎంపీటీసీ సబ్బాన శ్రీనివాసరావు, చింతాడ సత్యం ఆధ్వ ర్యంలో ఐదు కుటుంబాలు శనివారం టీడీపీలో చేరాయి. టీడీపీ నాయకుడు హరిబాబు ఇంటి వద్ద కూటమి అభ్యర్థి విజయచంద్ర సమక్షంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

● కూటమి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంధ్యారాణి

సాలూరు రూరల్: సాలూరు పట్టణానికి చెందిన పలువురు నాయీ బ్రాహ్మణులు జనార్దన్ ఆధ్వర్యంలో శనివారం టీడీపీలో చేరారు. సాలూరులోని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ఇంటి వద్ద వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆమె పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు తాను గెలవగానే నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమితో అన్ని వర్గాలకు మేలు

● పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జయకృష్ణకు మద్దతుగా నాయకుల ప్రచారం


ప్రచారంలో మాట్లాడుతున్న షకలక శంకర్

పాలకొండ: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయాలని చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని సినీ నటుడు షకలకశంకర్ అన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు మద్దతుగా ఆయన శనివారం పాలకొండ పట్టణంలో ప్రచారం నిర్వహించారు. గాజుగ్లాసు గుర్తుకు ఓటువేసి, జయకృష్ణను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు, గోపాలపురం సర్పంచ్ సిరిపురపు జగదీష్, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యక ర్తలు పాల్గొన్నారు. ● పాలకొండ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణను గెలిపించాలని మాజీ ఎంపీపీ పాలవలస కూర్మారావు కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాజకీయ అనుభవం ఉన్న కుటుంబం నుంచి అభ్యర్థిగా ఉన్న జయకృష్ణకు గెలిపించాలని కోరారు. ● పాలకొండ మండలం అవలంగి గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, కోట సంగంనాయుడు ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు కరగాన ప్రసాద్, గార్ల రాంబాబు, రాజు, మురళి తదితరులు పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** చిదిమి గ్రామంలో తోటపల్లి ఎడమ కాలువ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగారావు శనివారం ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయ్‌భాస్కర్, అల్లు కృష్ణమూర్తి, నీలకంఠంనాయుడు, రౌతు గణపతినాయుడు, లక్ష్మణనాయుడ పాల్గొన్నారు.

తెలంగాణాలో జిల్లావాసి మృతి


సాయి(ఫైల్)

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన గవర ముసలినాయుడు (సాయి)(24) తెలంగాణాలో రాష్ట్రంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబసభ్యులు అందించిన వివరాల ప్రకారం.. సాయి తెలంగాణా రాష్ట్రం భూపల్లి జిల్లాకు చెందిన రామగుండంలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. శనివారం తన స్నేహితులను దిగబెట్టడానికి వరంగల్ బస్టాండ్‌కు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. అక్కడ బస్సు కోసం ఎదురుచూస్తున్న సమయంలో సాయితో పాటు తన స్నేహితులను టిప్పర్ లారీ ఢీకొట్టింది. దీంతో సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. తన స్నేహితుడు కూడా ఒకరు మృతిచెందారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సాయి మరణవార్తను తన స్నేహితులు కుటుంబ సభ్యులకు అందించారు. సాయి మృతితో తండ్రి గోపాలం, తల్లి కన్నతల్లి, చెల్లి రాధ బోరున విలపిస్తున్నారు. చేతికి అందివచ్చిన కొడుకు చనిపోవడంతో కన్నీరుమున్నీరు అవుతున్నారు.

పురుగు మందు తాగి వృద్ధుడు..

సీతానగరం: బూర్జ గ్రామానికి చెందిన చందాన అప్పలనాయుడు(68) పురుగు మందు తాగి మృతిచెందాడు. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలనాయుడు గత కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. శుక్రవారం కడుపు నొప్పి భరించలేక ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగాడు. స్థానికులు గమనించి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.

18 నుంచి వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు


పూజలందుకుంటున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బెలగాం కోవెల వీధిలో వేంచేసి శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామని పట్టణ గ్రూపు దేవాలయాల ఈవో ప్రసాద్ తెలిపారు. ఆలయ వార్షికోత్సవం(బ్రహ్మోత్సవాలు)లో భాగంగా స్వామివారి శేష, గజ, గరుడ, శిబిక వాహన సేవలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామికి ప్రతిరోజూ సుప్రభాత సేవతో మొదలుకుని నిత్యవిశేష హోమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఓటింగ్ రోజే వారపు సంత

సీతంపేట: ఈనెల 13న ఎన్నికల ఓటింగ్ రోజే సీతంపేట వారపు సంత నిర్వహిస్తూ ఉండడం అభ్యర్థుల్లో అలజడి నెలకొంది. మండలంలోని నలుమూలల నుంచి ఆదివాసీలు తమ అటవీ ఉత్పత్తులను అమ్ముకోవడానికి సోమవారం జరిగే వారపు సంతకు పెద్ద ఎత్తున తరలివస్తారు. వీటిని కొనుగోలు చేయడానికి మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కూడా పెద్దఎత్తున తరలిరావడం, అదే రోజు ఎన్నికల ఓటింగ్ నిర్వహించడం, దీని ప్రభావం ఎన్నికల ఓటింగ్‌పై పడుతుందని వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల్లో అలజడి నెలకొంది. పాలకొండ నియోజకవర్గం ప్రతిసారి అభ్యర్థులు గెలుపులో సీతంపేట మండలం కీలకం కానుంది. గంపగుత్తగా ఒకే పార్టీకి ఓట్లు వేయడం, ఈ మండల మెజార్టీ నియోజకవర్గ నియోజకవర్గాల అభ్యర్థుల గెలుపునకు దోహదపడుతుందని అభిప్రాయం అభ్యర్థుల్లో నెలకొంది. ఈ తరుణంలో సోమవారం వారపు సంత జరగడం ఏ మేరకు ఓటింగ్ ప్రభావం చూపుతుందో అనే దానిపై అభ్యర్థులు సతమతమవుతున్నారు.

భక్తులకు అన్న సమారాధన


అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. తోటపల్లికి చెందిన ఓలేటి గౌరునాయుడు, గగన్ అన్నసమారాధనకు సాయం అందజేశారు. అలాగే మజ్జిగను అందించారు. ప్రతి శనివారం భక్తులకు ఉచిత అన్నసమారాధనకు దాతలు ముందుకు రావాలని ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో అన్నదాన ట్రస్ట్ చైర్మన్ మోనంగి ప్రకాశరావు, మార్కొండ సీతంనాయుడు, గౌరునాయుడు, పకీరునాయుడు, తామడ దుర్గారావుతో పాటు సిబ్బంది ఎం.మురళీనాయుడు, గంట శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం షాపులకు సీల్


మద్యం షాపునకు సీల్ వేస్తున్న దృశ్యం

భామిని: ఎన్నికల నిబంధనలు మేరకు ప్రశాంతంగా ఓటు వేసేందుకు మద్యం షాపులను సీల్ చేస్తున్నట్టు శ్రీకాకుళం ఎక్సైజ్ సీఐ జె.రవి కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో మద్యం షాపు తాళాలకు సీజ్ చేసినట్టు చెప్పారు. సోమవారం ఎన్నికల అనంతరం తెరుస్తామన్నారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. బత్తిలి, భామినిలో షాపులకు సీల్ వేసినట్టు తెలిపారు.

పార్టీలకు అతీతంగా విధులు నిర్వహించాలి

● విజయనగరం ఎస్పీ దీపికా పాటిల్

గజపతినగరం: అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయాలకు అతీతంగా పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పీ దీపికా పాటిల్ అన్నారు. శనివారం స్థానిక బీఎస్ఆర్ కాంప్లెక్స్ ఆవరణలో పోలీసు అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ వలంటీర్లతో విధులు, భద్రతపై దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 100 మీటర్ల పరిధిలో ఓటర్లు మినహా ఇతరులు ఉండకుండా చూడాలన్నారు. 200 మీటర్ల దూరంలోనే ఓటర్లు వాహనాలను నిలిపివేయాలని, ప్రశాంతయుతంగా ఎన్నికల నిర్వహణకు కృత నిశ్చయంతో పని చేయాలని ఆమె ఆదేశాలు జారీచేశారు. ఏ చిన్న సమస్య తలెత్తినా తక్షణమే సంబంధిత అధికారులకు సమాచారం అందజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద రూట్ మొబైల్స్‌వారు నిర్వహించాల్సిన బందోబస్తుపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, పీటీసీ డీఎస్పీ వీవీ అప్పారావు, సీఐ ఎస్.వి ప్రభాకరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వంశధార పైపులకు లీకులు



పెద్దూరు, గొయిది గ్రామాలకు వెళ్లే ప్రధాన పైపులు లీకేజీ కావడంతో వృథాగా పోతున్న నీరు

సీతంపేట: వంశధార నది నుంచి సీతంపేట మండలంలో 27 గ్రామాలకు నిరంతరం తాగునీరు అందించడానికి ఏర్పాటుచేసిన తాగునీటి పథకానికి లీకులు బెడద తప్పడం లేదు. నాసిరకం పనులు చేయడం వల్ల ఎక్కడికక్కడ పైపులు లీకై నీరు వృథాగా పోతున్నప్పటికీ వాటిని మరమ్మతు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో జలాలు అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి. ఒక పక్క వేసవి ఎద్దడి నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతుంటే మరోపక్క నీరు వృథాగా పోతుండడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బందికి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలి


సూచనలిస్తున్న తహసీల్దార్ జయ

గరుగుబిల్లి: ఎన్నికల విధుల నిర్వహణకు వచ్చే సిబ్బందికి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తహసీల్దార్ కె.జయ సూచించారు. మండలంలోని ఉల్లిభద్రలో బీఎల్వోలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులతో ఆమె శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 13న పోలింగ్ జరగనున్న దృష్ట్యా సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం చేరుకుంటారని చెప్పారు. ప్రతి కేంద్రంలో పది మందికి పైగా సిబ్బందిని నియమించామని తెలిపారు. వీరికి భోజన సౌకర్యాలను ఆయా పంచాయతీల పరిధిలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు వచ్చే సిబ్బంది ఆయా గ్రామాల్లోని రాజకీయ నాయకులతో మంతనాలు చేయడం గానీ, ఇళ్లకు వెళ్లడం చేయరాదన్నారు. బీఎల్వోలు పోలింగ్ కేంద్రం పరిధిలో తాగునీరు, కుర్చీలు, టెంట్లును ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈవోలు ఎస్.నాగభూషణరావు, కె.కొండలరావుతో పాటు బీఎల్వోలు, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలో ఫీవర్ సర్వే

● డీఎంవో జగన్మోహన్‌రావు


గర్భిణీ ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న డీఎంవో జగన్మోహన్‌రావు

కొమరాడ: గ్రామాల్లో పీవర్ సర్వే చేపట్టి జ్వర లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) టి.జగన్మోహన్‌రావు ఆదే శించారు. శనివారం ఆయన శివిని గ్రామాన్ని సందర్శిం చారు. అక్కడ వైద్య సిబ్బంది చేపడుతున్న ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. పీవర్ సర్వేలైన్స్, డ్రై డే కార్యక్రమాల నిర్వహణ, వాటి నమోదు వివరాలపై ఆరా తీశారు. సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలను పరిశీలించారు. గ్రామంలో ఫ్రైడే డ్రైడే ఏ మేరకు నిర్వహిస్తున్నారో గమనించాలని, దోమల లార్వా గుర్తించడంలో దృష్టి సారించాలని సూచించారు. సర్వేలో సేకరించిన రక్త పూతల స్లైడ్స్‌ను ల్యాబ్‌లో త్వరగా పరీక్షలు జరిపి నివేదికలు అందించాలన్నారు. అనంతరం గర్భిణుల గృహ సందర్శన చేసి ఆరోగ్య పరిశీలన చేశారు. డీహైడ్రేషన్‌కు గరికాకుండా తగు జాగ్రత్తలు సూచించారు. అవసరమైన మందులు, నిర్ధారణ పరీక్షలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో సీహెచ్ఎస్ విజయకుమారి, వైద్య సిబ్బంది ప్రమీల, లత, రామకృష్ణ, రమేష్, ఆశకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లపై సమీక్ష


భద్రతా ఏర్పాట్లపై సమీక్షిస్తున్న పోలీసు అధికారులు

సాలూరు రూరల్: నియోజకవర్గంలో ఈనెల 13న ఎన్నికల పోలింగ్‌కు భద్రత ఏర్పాట్లుపై డీఎస్పీ మురళీధర్ శనివారం పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా పరిధిలో ఉన్న 193 పోలింగ్ స్టేషన్లలో చేయాల్సిన భద్రతా ఏర్పాట్లపై ఆయన సాలూరులో చర్చించారు. ఎన్నికల సామగ్రి తరలింపునకు సంబంధించి 26 సెక్టార్లు వెళ్లే వాహనాలకు భద్రత తదితర అంశాలను చర్చించారు. ఈ సమావేశంలో సాలూరు అర్బన్, రూరల్ సీఐలు వాసునాయుడు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల వద్ద నిఘా ఉంచామని చెప్పారు. అదనపు బలగాలను కూడా వాడుతున్నామన్నారు. పెట్రోలింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత ఎన్నికలకు ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జూన్ 17 నుంచి గ్రామదేవత ఉత్సవాలు


సమావేశంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

ఒడిశా

రాయగడ: రాయగడ గ్రామదేవత బురదల పోలమ్మ ఉత్సవాలు జూన్ 17 నుంచి వారం రోజుల పాటు జరిపేందుకు ఆలయ కమిటీ తీర్మానించింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా పతివాడ శ్రీనివాసనాయుడు, ఉపాధ్యక్షుడిగా ఎద్దు శ్రీహరి, కార్యదర్శిగా వి.శేషగిరి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కింతలి శ్రీనివాసరావులకు బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అందరి సహకారంతో అమ్మవారి సంబరాలు అంగరంగ వైభవంగా జరుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమం లో సురేంద్ర సాహు, సీర రమణ, గ్రామపెద్దలు, వివిధ సంఘాల ప్రతినిధులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశమివ్వండి

రాయగడ: ఈ సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపించాలని, తనకు ఒక అవకాశం ఇస్తే మీ గొంతునై ఉంటానని రాయగడ కాంగ్రెస్ పార్టీ శాసనసభ అభ్యర్థి అప్పలస్వామి కద్రక అన్నారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం స్థానిక తేజస్వీ హోటల్‌లో వివిధ కుల సంఘాలతో కలిసి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చారని, ఈసారి తనకు ఒక అవకాశం ఇస్తే అన్ని వర్గాల ప్రజల ఆకాంక్ష మేరకు జిల్లా అభివృద్ధికి విశేష కృషిచేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి సప్తగిరి ఉలకను కూడా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఛత్తీస్‌ఘడ్ దంతరి జిల్లా సిహోవ నియోజకవర్గ సిటింగ్ ఎమ్మెల్యే అంబికా మరకమ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని అన్ని కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు కూల్ పెయింట్

సాలూరు రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలో పోలింగ్ కేంద్రాల పైన ఎండ వేడిమి తట్టుకోవడానికి శనివారం కూల్ పెయింటింగ్ వేశారు. జిల్లాలో 1,037 పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎండలు మండుతున్నాయి. పోలింగ్ రోజున ఎన్నికల సిబ్బంది, ఓటర్లు పోలింగ్ కేంద్రంలో ఉక్కబోతకు గురికాకుండా ఉండేందుకు పాఠశాలల పైకప్పులకు కూల్ పెయింటింగ్‌ను వేయిస్తున్నారు. ఈ ఖర్చును ఎస్ఎంఎఫ్ నుంచి చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశాలిచ్చారు.

పరమేశ్వరి అవతారంలో పారమ్మతల్లి


పరమేశ్వరిగా చందన పారమ్మతల్లి

సాలూరు రూరల్: పారమ్మ కొండ వద్ద ఉన్న పారమ్మతల్లి చందనో త్సవాల్లో భాగంగా శనివారం ఆమె భక్తులకు శక్తి స్వరూపిణీ పరమేశ్వరిగా దర్శన మిచ్చింది. చందనంతో కూడిన అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకు న్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

గజపతినగరం: సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్టు ఎన్నికల పరిశీలకుడు హనీష్ ఛాబ్రా తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పీవో, ఏపీవోలకు జరిగిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో 5 మండలాలకు సంబంధించి 264 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 1,320 మంది పీవోలు, ఏపీవోలు, ఓపీలు ఉన్నట్టు తెలిపారు. అలాగే పలు శాఖలకు సంబంధించి 200 మంది ఉద్యోగులు ఎన్నికల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రిజర్వులో 80మంది పీవోలు, 120 మంది ఏపీవోలు ఉన్నారన్నారు. 33 సెక్టార్లలకు సంబంధించి 33 వాహనాలను అందుబాటులో ఉంచామని ఆయన చెప్పారు.

మినీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కారిగూడ సీతంపేట గిరిజన బాలికల మినీ గురుకుల పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు అన్నదొర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు ఒక్కొక్క పాఠశాలలో 30 మంది విద్యార్థుల ప్రవేశానికి ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జూన్ 6న లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తామని చెప్పారు. గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న కౌన్సిలింగ్‌కు దరఖాస్తులు పెట్టుకున్న అభ్యర్థులు హాజరు కావాలన్నారు.

మల్లి పీవీటీజీ పాఠశాలలో..

సీతంపేట: మల్లి బాలుర పీవీటీజీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో శుభం బన్సాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని, జూన్ 5న లాటరీ పద్ధతిలో సీట్లు భర్తీ చేస్తామని చెప్పారు. మల్లి పీవీటీజీ పాఠశాలలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

మరమ్మతుల కారణంగానే విద్యుత్ సరఫరాలో అంతరాయం

భామిని: మండలంలోని సీతంపేట 33 కేవీ లైన్‌లో మరమ్మతులు కారణంగా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని భామిని సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన 'చినుకుపడితే చీకటే' అనే కథనంపై ఆయన స్పందించి మాట్లాడారు. సీతంపేటలో 33 కేవీ లైన్ మరమ్మతులకు గురవడంతో శుక్రవారం మూడు గంటల పాటు సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. అయితే సరఫరా వచ్చాక భామిని నుంచి గురండి 33 కేవీ లైన్‌కు వచ్చే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సిబ్బంది పెట్రోలింగ్ చేయించి రాత్రి 11.30 గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మండే ఎండలు, సాయంత్రం పూట వర్షాల కారణంగా వైర్లకు పగుళ్లు వచ్చి, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన చెప్పారు.

పుస్తక పఠనంపై అవగాహన

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆశయ సేవా సంస్థ పుస్తక పఠనంపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.